

గ్రామాల అభివృద్ధిలో..

ప్రభుత్వ పథకాల అమలులో అధికారుల పాత్ర ఎంతో కీలకమని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి పేర్కొన్నారు. 10లో ▸



యువతతోనే వికసిత భారత్

యువతతోనే వికసిత భారత్ సాధ్యమని భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. 10లో ▸



కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎనుముల తిరుపతిరెడ్డి అన్నారు. 11లో ▸

న్యూస్‌రీల్

వీడీడీఎఫ్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ



అమరవీరులకు నివాళులర్పిస్తున్న వీడీడీఎఫ్ ప్రతినిధులు

అనంతగిరి: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం రాత్రి వీడీడీఎఫ్(వికారాబాద్ డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ ఫోరం)ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా అమరవీరుల స్థూపం వరకు ర్యాలీ సాగింది. అనంతరం అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు.

నిరుపేదలకే ఇందిరమ్మ ఇళ్లు

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్: నిరుపేదలకే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. సోమవారం తాండూరు మండలం సంగెంకలాన్ గ్రామంలో 60 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం పేదలందరికీ ఇళ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రజా పాలన సాగుతోందన్నారు. రాజీవ్ యువ వికాసం, సన్న రకం వడ్లకు రూ.500 బోనస్ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. సంగెంకలాన్ గ్రామానికి రోడ్డు సౌకర్యంతో పాటు బస్సు కూడా వచ్చేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విశ్వప్రసాద్, డీసీసీబీ వైస్ చైర్మన్ రవిగౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నాగప్ప, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మేఘనాథ్ గౌడ్, కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఉత్తమ్‌చంద్, నాయకులు వడ్డె శ్రీనివాస్, పండరి, శరుణు బసప్ప, రాజ్‌కుమార్, పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత పెద్దేముల్

తాండూరు మండలం చెంగోల్ గ్రామంలో బీఎమ్మార్ క్రికెట్ టోర్నమెంట్ సోమవారంతో ముగిసింది. విజేతగా పెద్దేముల్ జట్టు, రెండో స్థానంలో గుంతబాసుపల్లి జట్లు నిలిచాయి. గెలుపొందిన జట్లకు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి బహుమతులు అందజేశారు. కార్యాక్రమంలో టోర్నీ నిర్వాహకులు, క్రీడాకారులు రాము యాదవ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కలను నెరవేర్చడమే లక్ష్యం

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తదితరులు

దోమ: పేదల సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి అన్నారు. మండలంలోని శివారెడ్డిపల్లికి చెందిన షరీఫా బేగం ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకుంది. సోమవారం నిర్వహించిన గృహ ప్రవేశ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఆరు గ్యారంటీలను నెరవేరుస్తున్నట్లు పేర్కొన్నారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం నాలుగు విడతలుగా రూ.5 లక్షలు ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పార్టీ ఆయా మండలాల అధ్యక్షులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

విత్తనాల పంపిణీ

అనంతరం గ్రామంలోని రైతులకు ఎమ్మెల్యే సబ్సిడీ విత్తనాలను పంపిణీ చేశారు. వరి, కందులు, జొన్న విత్తనాలను ఏవో ప్రభాకర్ రావుతో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గ్యామా, ఏఈవోలు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి

మంచాల: శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు పూర్తి సహకారం అందించాలని రాచకొండ సీపీ సుధీర్ బాబు అన్నారు. మండల పరిధిలోని ఆగాపల్లిలో నాగార్జునసాగర్– హైదరాబాద్ రోడ్డుపై మంచాల పోలీసులు ఏర్పాటు చేసిన వాహన తనిఖీ శిబిరాన్ని సోమవారం ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు.

సమగ్రాభివృద్ధే లక్ష్యం

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

- ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు
- పాల్గొన్న ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి



మాట్లాడుతున్న స్పీకర్ ప్రసాద్ కుమార్



స్టాళ్లను పరిశీలిస్తున్న స్పీకర్, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, కలెక్టర్ ప్రతీక్‌జైన్ తదితరులు

వికారాబాద్: ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం శక్తి వంచన లేకుండా కృషి చేస్తోందని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన స్పీకర్ అనంతరం జాతీయ జెండాను ఎగురవేసి మాట్లాడారు. అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిన్నర కాలంలో గ్రామ, పట్టణ, నగరాలు సమగ్రాభివృద్ధి సాధిస్తున్నాయని పేర్కొన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న సంకల్పంతో ఇందిరా మహిళా శక్తి మిషన్‌కు శ్రీకారం చుట్టిందన్నారు. మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో జిల్లాలో ఇప్పటి వరకు రూ.20.37 కోట్ల వడ్డీలేని రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. పెట్రోల్ బంకులు, మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేసి వారిని ప్రోత్సహిస్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్ సరఫరా, 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు చెప్పారు.

5,214 మందికి ఇందిరమ్మ ఇళ్లు

రాష్ట్రంలో ఏ ఒక్కరూ సొంత ఇల్లు లేనివారు ఉండరాదన్న లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 5,214 పేదలకు ఇళ్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. తొలి దశ నిర్మాణం పూర్తి చేసుకున్న వారికి రూ.92లక్షలు అందజేసినట్లు తెలిపారు. జిల్లాలో 1,00,358 రైతులకు రూ.849 కోట్లు రుణ మాఫీ చేసినట్లు గుర్తుచేశారు. రైతు భరోసా పథకం కింద జిల్లాలోని 2,26,253 మంది రైతుల ఖాతాల్లో రూ.213 కోట్లు జమచేశామన్నారు. సన్న రకం వడ్లు 49,680 క్వింటాళ్లు కొనుగోలు చేసి బోనస్ కింద రూ. 2.48కోట్లు అందజేసినట్లు తెలిపారు. అలాగే 64,437 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో రూ.104 కోట్లు జమ చేశామని చెప్పారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద భూమిలేని వ్యవసాయ కూలీ కుటుంబానికి ఏడాదికి రూ.12 వేలు ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు. జిల్లాలో 19,888 లబ్ధిదారులకు మొదటి విడతగా రూ.11.93 కోట్ల కూలీల ఖాతాల్లో జమ చేసామని తెలిపారు. దేశంలో ఎస్సీ వర్గీకరణ చేసిన తొలి రాష్ట్రం తెలంగాణ అని స్పష్టం చేశారు.

ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

ఉద్యోగ, ఉపాధి కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందితెలిపారు. జిల్లాలో 1,603 ఉద్యోగ నియామకాలు పూర్తి చేసినట్లు వివరించారు.విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందని స్పీకర్ ప్రసాద్‌కుమార్ పేర్కొన్నారు.జిల్లాలోని వికా రాబాద్, పరిగి ప్రాంతాలకు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల మంజూరైనట్లు తెలిపారు.రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం కింద జిల్లాలో 15,188 మంది లబ్ధి పొందారని పేర్కొన్నారు. శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారికి రూ.41.65 కోట్లు అందజేశామని తెలిపారు.

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని అందుబాటులోకి తెచ్చిందని తెలిపారు. జూన్ 3 నుంచి కొత్త చట్టం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. జిల్లాలో ఈ చట్టం అమలుకు ధారూరును పైలెట్ మండలంగా ఎంపిక చేశారని తెలిపారు. మూడు బృందాలను ఏర్పాటు చేసి, గ్రామగ్రామాన రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతుల నుంచి 579 దరఖాస్తులు స్వీకరించినట్లు చెప్పారు. వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. జిల్లాలోని 1,07,525 మంది పింఛనుదారులకు ప్రతి నెలా రూ.26.22 కోట్లు చెల్లిస్తున్నట్లు తెలిపారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద జిల్లాలోని 4,738 మంది లబ్ధిదారులకు రూ.47.43 కోట్లు అందజేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకొని జిల్లా వ్యాప్తంగా 6,941 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. అనంతరం అమరవీరుల కుటుంబాలను సన్మానించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ఏర్పాటు చేసిన స్టాళ్లను ప్రజాప్రతినిధులు వీక్షించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, అదనపు ఎస్పీ హనుమంత రావు, ఆర్డీవో వాసుచంద్ర, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.



మరమ్మతులకు నోచుకోని కొడంగల్ చెరువు

చెరువులపై నిర్లక్ష్యపు నీడ

- ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోని వైనం
- తగ్గిన నీటి సామర్థ్యం
- బీడుగా మారుతున్న ఆయకట్టు
- ఆందోళనలో రైతులు

కొడంగల్: నియోజకవర్గంలోని ప్రధాన చెరువులు, కుంటలు మరమ్మతులకు నోచుకోక బోసిపోయి కనిపిస్తున్నాయి. సాగునీరు లేక ఆయకట్టు భూములు బీడుగా దర్శనమిస్తున్నాయి. పలు చెరువుల కింద వేల ఎకరాల ఆయకట్టు ఉంది. అయినా పంటలు పండగ పొలాలు నిరుపయోగంగా మారాయి. నియోజకవర్గంలో వర్షాలు పడితేనే పంటలు పండుతాయి. వర్షాధార పంటలపై ఆధారపడి ఈ ప్రాంత రైతులు వ్యవసాయం చేస్తున్నారు. కొంతమంది రైతులు బోర్లు వేసుకొని పంటలు పండిస్తున్నారు. కురిసిన కొద్దిపాటి వర్షం నీరైనా చెరువుల్లోకి వచ్చి చేరుతుందా అంటే కష్టమే. నోటీఫైడ్ చెరువులు.. కుంటల్లో మట్టి పేరుకు పోయింది. పాటు కాల్వలకు మరమ్మతులు లేవు. వరద నీరు చెరువుల్లోకి వచ్చే పరిస్థితి లేదు. నియోజకవర్గంలోని చెరువులకు గతంలో చేసిన పనులు నామమాత్రంగా జరిగాయి. నిజాం కాలంలో నిర్మించిన చెరువులకు మరమ్మతులు చేయకపోవడంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గింది. హస్నాబాద్ చెరువుకు 950 ఎకరాల ఆయకట్టు, కొడంగల్ చెరువుకు 550 ఎకరాల ఆయకట్టు ఉంది. కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్, దుద్యాల మండలాల్లోని చెరువులు, కుంటలు నిండటం లేదు. దీంతో పంటలు సాగు చేయడం లేదు. కొడంగల్ మండలంలో 5 నోటీఫైడ్ చెరువులు ఉన్నాయి. వందలాది మంది రైతులకు చెరువుల కింద ఆయకట్టు భూములు ఉన్నాయి. మిషన్ కాకతీయ పనులు నియోజకవర్గంలో ఆశించిన స్థాయిలో జరగలేదు. ఇప్పటికైనా చెరువుల మరమ్మతులపై అధికారులు దృష్టి సారించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

అనంతగిరి: ప్రభుత్వ ఆదేశాల మేరకు నేటి నుంచి ఈ నెల 20 వరకు ప్రతి మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ ప్రతీక్ జైన్ సోమవారం ప్రకటనలో తెలిపారు. భూ భారతి చట్టం అమలులో భాగంగా భూ సమస్యలపై వచ్చిన అర్జీలను పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. ఆయా గ్రామాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సులకు రైతులు హాజరై భూ సమస్యలపై దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వాటిని సత్వరం పరిష్కరిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.



బీజేపీ నాయకులను సన్మానిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

దైవచింతనతో మానసిక ప్రశాంతత

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి

మర్పల్లి: దైవచింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్ రెడ్డి అన్నారు. మండలంలోని పట్లూర్‌లో మూడు రోజులుగా దుర్గామాత ఉత్సవాలు జరుగుతున్నాయి. సోమవారం ముగింపు వేడుకల్లో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆలయ పునర్నిర్మాణం చేపట్టాలని, ఇందుకు తమ వంతుగా సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు మాధవరెడ్డి, మండల అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి మల్లేశ్ యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, నాయకులు బలరాంగౌడ్, తదితరులు పాల్గొన్నారు. అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ దర్శించుకున్నారు. వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ బాల్క్ –2 అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మండల మాజీ అధ్యక్షులు ప్రభాకర్, రవిందర్, జిల్లా కార్యదర్శి సంజీవరెడ్డి పాల్గొన్నారు.

ఒక మార్పు.. అభివృద్ధికి మలుపు

- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి
- మున్సిపల్ అభివృద్ధికి వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక ప్రారంభం

తాండూరు టౌన్: ఒక మార్పు.. అభివృద్ధికి మలుపు అనే నినాదంతో తాండూరు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమానికి పట్టణ ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ఇందుకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించి, జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణాన్ని సుందరంగా, పచ్చదనంగా, పరిశుభ్రంగా ఉంచడంలో భాగంగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో 100 రోజుల ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. సెప్టెంబర్ 10వ తేదీ వరకు జరగనున్న ఈ కార్యక్రమంలో అన్ని వార్డుల్లో పారిశుధ్య పరిరక్షణ, మొక్కలు నాటడం, పట్టణ సుందరీకరణ తదితర కార్యక్రమాలను నిర్వహిస్తారన్నారు. ఇందుకు ప్రజలు సహకరించాలని కోరారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డి, మేనేజర్ నరేందర్ రెడ్డి, ఏఈఈ ఖాజహుస్సేన్, సిబ్బంది, మెప్మా ఆర్పీలు, వార్డు ఆఫీసర్లు తదితరులు కార్యాలయం నుంచి ఇందిరాచౌక్ వరకు ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కొత్రిక విజయలక్ష్మి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు ధారాసింగ్, మాజీ కౌన్సిలర్లు రత్నమాల, నీరజ, ప్రభాకర్ గౌడ్, ప్రవీణ్ గౌడ్ పాల్గొన్నారు.



వంద రోజుల ప్రణాళికపై ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

ఒకే దేశం.. ఒకే ఎన్నిక

- ఇదే బీజేపీ నినాదం
- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

పరిగి: దేశంలో నిత్యం ఎన్నికలు జరగడం ద్వారా అభివృద్ధి కుంటు పడుతోందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం పరిగి పట్టణంలో ఒకే నేషన్.. వన్ ఎలక్షన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా ఒకే సారి ఎన్నికలు నిర్వహిస్తే వేల కోట్ల రూపాయల ఖర్చు తగ్గుతుందన్నారు. ప్రతి మూడు, నాలుగు నెలలకు ఎన్నికలు నిర్వహించడం ద్వారా కోడ్ అమల్లోకి వచ్చి అభివృద్ధికి ఆటంకం కలుగుతుందన్నారు. వీటన్నంటినీ దృష్టిలో ఉంచుకునే ఒకే సారి ఎన్నికలకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతోందని తెలిపారు. గడిచిన పదేళ్లలో దేశం ఎంతో పురోగతి సాధించిందని పేర్కొన్నారు. ఇది ప్రధాని మోదీతోనే సాధ్యమైందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. అలాగే అర్హులైన వారికి పథకాలు అందేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని కాపాడుకుందాం




ప్రచార జాతలో టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

కుల్కచర్ల: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచి విద్యారంగాన్ని కాపాడుకుందామని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోపాల్‌నాయక్ పిలుపునిచ్చారు. సంఘం రాష్ట్ర శాఖ పిలుపుమేరకు మండల పరిధిలోని అన్మాస్‌పల్లిలో సోమవారం ప్రచార జాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజ హితం కోసం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని అన్నారు. అన్ని రకాల మౌలిక వసతులతో పాటు నిష్ణాతులైన ఉపాధ్యాయులు అందుబాటులో ఉంటారన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి శంకర్‌నాయక్, మండల అధ్యక్షుడు జంగయ్య, మాజీ సర్పంచ్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



స్పీకర్ ప్రసాద్‌కుమార్ చేతుల మీదుగా అవార్డులు అందుకుంటున్న వికారాబాద్ ఆర్డీఓ వాసుచంద్ర



డీపీఓ జయసుధ, డీఎఫ్‌ఓ జ్ఞానేశ్వర్, హౌసింగ్ పీడీ కృష్ణయ్య, హార్టికల్చర్ అధికారి సత్తార్, డీఎంహెచ్‌ఓ వెంకటరవణ, జిల్లా ప్లానింగ్ ఆఫీసర్ వేణుగోపాల్

ఉత్తమ సేవలకు అవార్డులు

విధి నిర్వహణలో భాగంగా ఉత్తమ సేవలందించిన పది మంది జిల్లా అధికారులకు అవార్డులు దక్కాయి. సోమవారం రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో భాగంగా వికారాబాద్ కలెక్టరేట్‌లో స్పీకర్ ప్రసాద్‌కుమార్, కలెక్టర్ ప్రతీక్‌జైన్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు.

– అనంతగిరి

క్లుప్తంగా

ఉత్తమ కార్యదర్శిగా నర్సింలు



మోమిన్‌పేట: మండల పరిధిలోని ఏన్కతల పంచాయతీ కార్యదర్శి నర్సింలుకు ఉత్తమ కార్యదర్శి అవార్డుకు ఎంపికయ్యారు. మండలంలోని మోమిన్‌పేట, ఏన్కతల పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఆవిర్భావ వేడుకల్లో ఆయన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

డీఎస్పీకి వినతిపత్రం అందజేత

తాండూరు టౌన్: దళిత యువకుని పెళ్లి బారాత్‌ను అడ్డుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం డీఎస్పీ బాలకృష్ణారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. గత నెల 18న బెల్కటూర్‌లో జరిగిన ఘటనపై విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరారు.

తల్లిదండ్రులు మందలించారని..

మనస్తాపంతో యువకుడి బలవన్మరణం



ఆంజనేయులు(ఫైల్)

కుల్కచర్ల: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ ఉరేసుకుని మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కుల్కచర్ల మండలం ఇప్పాయిపల్లికి చెందిన ఏముకంటి ఆంజనేయులు(26) తల్లిదండ్రులు మందలించారనే మనస్తాపంతో గత శనివారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు, బంధువులను ఆరా తీసినా ఫలితం కనిపించలేదు. దీంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో సోమవారం ఇప్పాయిపల్లి చెరువుకట్ట సమీపంలో ఓ యువకుడు చెట్టుకు ఉరేసుకున్నాడని పోలీసులకు సమాచారం అందింది. వారు వెళ్లి పరిశీలించగా మృతుడు ఆంజనేయులుగా గుర్తించారు. మృతుడి తండ్రి నర్సింలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

గ్రామాల అభివృద్ధిలో అధికారుల పాత్ర కీలకం

డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి



తహసీల్దార్ మనోహర్, ఎస్‌ఐ రమేష్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

కుల్కచర్ల: ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందాలన్నా.. గ్రామాల్లో శాంతియుత వాతారణం కొనసాగాలన్నా అధికారుల ప్రాత కీలకమని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కుల్కచర్ల ఏఎంసీ చైర్మన్ ఆంజనేయులు, పీఏసీఎస్ చైర్మన్ మొగులయ్య అన్నారు. సోమవారం తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి, ఎస్‌ఐ రమేష్ బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, మాజీ సర్పంచ్ వెంకటయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఆనందం, మార్కెట్ కమిటీ డైరక్టర్లు రాంచంద్రయ్య, ఎల్లయ్య, భరత్‌కుమార్ రెడ్డి, నాయకులు కృష్ణయ్య, వినోద్, శ్రీను, డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, గిర్దవారులు ఖాజా, రవి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రాటోకాల్ లేని వ్యక్తులకు ప్రాధాన్యం

రాష్ట్ర ఆవిర్భావ వేడుకలపై బీజేపీ, బీఆర్ఎస్ నేతల మండిపాటు



మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

కుల్కచర్ల: రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో ప్రొటోకాల్ లేని వ్యక్తులకు ప్రాధాన్యం కల్పించారని బీజేపీ జిల్లా కార్యవర్గసభ్యుడు బందయ్య, పార్టీ చౌడాపూర్ అధ్యక్షుడు శ్రీనివాసులు ఆరోపించారు. సోమవారం అవతరణ వేడుకల అనంతరం ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వరి, కంది విత్తనాల పంపిణీని రైతు వేదికలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాత్రమే ఉండటాన్ని బీజేపీ నేతలు ప్రశ్నిస్తూ ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు అక్కడికి చేరుకోవడంతో కొంత హడావుడి నెలకొంది. అధికారిక కార్యక్రమంలో ప్రోటోకాల్ లేని వ్యక్తులకు ప్రాధాన్యం ఇచ్చారని మండిపడ్డారు. అనంతరం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సత్తినేని సుధాకర్‌రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించి అధికారులు తీరును తప్పుబట్టారు. కార్యక్రమంలో నాయకులు నర్సింలు, చెన్నయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు ఉత్తమ అవార్డులు



అవార్డు అందుకుంటున్న వికారాబాద్ తహసీల్దార్ లక్ష్మీనారాయణ



సతీష్‌కుమార్
అటెండర్ (డీపీఆర్‌ఓ)



అరుణ్‌కుమార్
కలెక్టర్ సీసీ



నవీన్
అడిషనల్ కలెక్టర్ సీసీ



విజయేందర్
ధారూరు డీటీ



దీపక్
కలెక్టరేట్ సీ-సెక్షన్



మహమూద్
(ఐటీ ఈ-మేనేజర్)



హరికృష్ణ ట్రైబల్ వెల్ఫేర్
జూనియర్ అసిస్టెంట్



లక్ష్మప్ప
లైబ్రేరియన్



శివకుమార్ హెచ్‌సీ,
సీసీఎస్



లక్ష్మి
జైదుపల్లి వీఓఏ



విశ్వప్రసాద్
ఎంపీడీఓ



ఎస్‌ఐ షాబుద్దీన్
(పీసీఆర్)



ప్రశంసాపత్రం అందుకుంటున్న
సిరిపురం బాలుర హాస్టల్ వార్డెన్ తుల్జారాంగౌడ్



సంతోష్‌కుమార్
ఎస్‌ఐ, పరిగి



మహిపాల్‌రెడ్డి
ఎస్‌ఐ, తాండూరు



వీరన్న, ఎస్‌ఐ
(కోర్టు లైజన్ అధికారి)



శ్రీశైలం,
ఆర్ఎస్‌ఐ

అనంతగిరి: వికారాబాద్ కలెక్టరేట్‌లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో జిల్లా, మండల స్థాయి ఉత్తమ అధికారులకు అవార్డులు అందజేశా రు. జిల్లా పోలీస్ కంట్రోల్ రూంలో ఎస్‌ఐగా పనిచేసే షాబుద్దీన్, ఎస్‌ఐ సంతోష్‌కుమార్ (పరిగి), ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి(తాండూరు టౌన్), ఎస్‌ఐ వీరన్న(డీసీఆర్‌బీ), స్పెషల్ బ్రాంచ్ హోం గార్డు శ్రీనివాస్, సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ శివకుమార్, ఉమెన్ పీఎస్ కానిస్టేబుల్ ప్రసన్న, కమ్యూనికేషన్ విభాగంలో పనిచేసే కానిస్టేబుల్ సంధ్యారాణి, ఐటీ కోర్ కా నిస్టేబుల్ సత్యనారాయణ, ఏఆర్ కానిస్టేబుల్ గణేష్, కానిస్టేబుల్ నగేష్ (వికారాబాద్), హరీష్(ధారూరు), నాగమ్మ(మర్పల్లి), నూర్జహాన్ బేగం(వికారాబాద్), హెడ్ కానిస్టేబుల్ హన్మంత్ (యాలాల), నరేందర్ పీసీ (తాండూర్), కురుమూర్తి పీసీ(కరణ్‌కోట్), హీరాలాల్ పీసీ(దోమ), అనిల్‌కుమార్ పీసీ(దుద్యాల్), అంజప్ప పీసీ(టాస్క్‌ఫోర్స్), శ్రీనివాస్ పీసీ (ఇంటలిజెన్స్), ఆర్ఎస్ఐ శ్రీశైలంగౌడ్(డీఏఆర్), అనిల్‌కుమార్ ఏఆర్‌పీసీ, హోంగార్డు కృష్ణయ్య(ఎస్పీ కార్యాలయం), శివకుమార్ జూనియర్ అసిస్టెంట్, అశోక్ కుమార్ సీనియర్ అసిస్టెంట్ ఉన్నారు.

దుద్యాల్ తహసీల్‌కు అవార్డుల పంట



అవార్డు అందుకుంటున్న తహసీల్దార్ కిషన్





ప్రశంసాపత్రం అందుకుంటున్న
భాస్కర్ గౌడ్, రాజిరెడ్డి

నలుగురికి ఉత్తమ అవార్డులు

దుద్యాల్: తహసీల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న నలుగురు అధికారులు జిల్లా ఉత్తమ ఉద్యోగి అవార్డుకు ఎంపికయ్యారు. ఉత్తమ తహసీల్దార్‌గా కిషన్, ఉత్తమ ఉప తహసీల్దార్‌గా వీరేశ్‌బాబు, ఉత్తమ ఆర్‌ఐగా నవీన్, ఉత్తమ సర్వేయర్‌గా మహేశ్‌కుమార్‌ను ఎంపిక చేశారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో వారిని కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందజేశారు.

ఉత్తమ కార్యదర్శులుగా భాస్కర్, రాజిరెడ్డి

కుల్కచర్ల: కుల్కచర్ల, చౌడపూర్ కార్యదర్శులు భాస్కర్, రాజిరెడ్డి ఉత్తమ అవార్డులకు ఎంపికయ్యారు. సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఆవిర్భావ వేడుకల్లో కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందజేశారు. భాస్కర్ కుల్కచర్ల ఇన్‌చార్జి ఎంపీఓగా భాధ్యతలు నిర్వహిస్తుండగా, రాజిరెడ్డి చౌడాపూర్ ఇన్‌చార్జి ఎంపీఓగా విధులు నిర్వహిస్తున్నారు.



అవార్డు స్వీకరిస్తున్న
ఎంపీఓ యాదయ్య

ఎంపీఓకు ఉత్తమ సేవా అవార్డు

యాలాల: మండల పంచాయతీ అధికారి గాలి యాదయ్య సోమవారం ఉత్తమ సేవా అధికారి అవార్డును అందుకున్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో స్పీకర్ ప్రసాద్‌కుమార్, జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆయనకు ఈ అవార్డు అందజేశారు. బీసీ బాలికల హాస్టల్ సంక్షేమాధికారి భాగ్యలక్ష్మికి సైతం అవార్డును అందుకున్నారు.

కొడంగల్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి

కొడంగల్: కొడంగల్‌ను రాష్ట్రంలో ఉత్తమ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలో ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మైనార్టీ మహిళలకు 2వేల కుట్టుమిషన్లు, ఎనిమిది మంది దివ్యాంగులకు ట్రై మోటార్ సైకిళ్లు, కడా కార్యాలయంలో రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి సుమారు రూ.10వేల కోట్లతో పనులు పనులు ప్రారంభించినట్లు చెప్పారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, ప్రభుత్వ ఫిజియోథెరపీ కళాశాల, పారామెడికల్ కళాశాల మంజూరు చేసినట్లు గుర్తు చేశారు. కొడంగల్ ప్రభుత్వాస్పత్రిని టీచింగ్ ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసిన ఘతన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిదే అని చెప్పారు. ఈ కార్యక్రమంలో కడా అధికారి వెంకట్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్‌అంబయ్య గౌడ్, నాయకులు ఓబెదుల్లా కోత్వాల్, మహ్మద్ యూసూఫ్, ప్రశాంత్, నయీమ్, మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్, తహసీల్దార్ విజయ్‌కుమార్, మైనార్టీ శాఖ అధికారులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు ట్రై మోటార్ సైకిళ్లు
అందజేస్తున్న తిరుపతిరెడ్డి



శిక్షణార్థులతో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

నైపుణ్యం కలిగిన యువతతోనే వికసిత భారత్

- భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- భూభారతి చట్టంతో సమస్యలు తొలగాలని ఆకాంక్ష

శంషాబాద్ రూరల్: దేశాభివృద్ధిలో తమ భాగస్వామ్యం ఏమిటో ప్రతి పౌరుడు ఆత్మ విమర్శ చేసుకోవాలి.. నైపుణ్యం కల్గిన యువతరమే వికసిత భారతానికి బాటలు వేయగలదని భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలంలోని ముచ్చింతల్ శివారులో ఉన్న స్వర్ణ భారత్ ట్రస్టు ఆవరణలో సోమవారం శిక్షణార్థులతో ఆయన ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. ట్రస్టు శిక్షణార్థులు, భూభరతి లైసెన్స్‌డ్ సర్వేయర్ల శిక్షణార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతులు, మహిళలు, యువత అభివృద్ధిపై స్వర్ణ భారత్ ట్రస్టు ప్రధాన దృష్టి పెట్టిందన్నారు. ఒక పూట అన్నం పెట్టడం కాకుండా.. స్వశక్తితో రోజూ ఆహారాన్ని సమకూర్చుకునేలా నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. నిత్య జీవితంలో యోగా, ధ్యానం, ఆరోగ్యకర ఆహారాన్ని జీవన విధానంగా చేసుకోవాలని సూచించారు.

అదృశ్యమైన యువకుడు.. శవమై తేలాడు

చేవెళ్ల: అదృశ్యమైన యువకుడు శవమై తేలాడు. ఈ ఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని భగత్ సింగ్ కాలనీకి చెందిన గాదె రఘు(26) ఆర్టీసీ కార్గోలో డైలీ కూలిగా పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ఉదయం పనికి వెళ్తున్నట్లు చెప్పి రాత్రి అయినా తిరిగి రాలేదు. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో సోమవారం ఆయన సోదరి రమాదేవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో చేవెళ్ల వేంకటేశ్వర స్వామి ఆలయం పక్కన ఉన్న గుండంలో మధ్యాహ్నం ఓ మృతదేహం నీటిపై తేలియాడుతున్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు శవాన్ని బయటకు తీసి పరిశీలించి మృతుడు తప్పిపోయిన గాదె రఘుగా గుర్తించారు. చేవెళ్ల ప్రభుత్వాస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో గురుకుల బాలికల సత్తా



ఆర్.గీతిక(905)



ఎం.నందు(1,956)



టి.అక్షయ(5,761)



జి.అనూష(2,504)



పి.రమ్యశ్రీ(5,416)



దీపన్విత (1,248)

ఇబ్రహీంపట్నం: నల్లకంచె ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల విద్యార్థినులు జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో సత్తాచాటారు. సోమవారం వెల్లడించిన ఫలితాల్లో గీతిక 905, నందు 1,956, అక్షయ 5,761, అనూష 2,504, రమ్యశ్రీ 5,416వ ర్యాంక్ సాధించారు. కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది విద్యార్థినులను అభినందించారు.

మెరిసిన గిరిజన తేజం

కేశంపేట: జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలో మండల పరిధిలోని దేవునిగుడితండాకు చెందిన గిరిజన విద్యార్థిని వి.దీపన్విత ఆల్ ఇండియా 1,248వ ర్యాంక్ సాధించింది. తండాకు చెందిన బాలు నాయక్ తన భార్యతో కలిసి వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వీరికి కుమారుడు, కుతూరు ఉన్నారు. కుతూరు దీపన్విత 1వ తరగతిని తండాలోనే ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చదివింది. అనంతరం 2వ తరగతి నుంచి 10వ తరగతి వరకు షాద్‌నగర్ ఇంగ్లిష్ మీడియం పబ్లిక్ స్కూల్‌లో చదివింది. అనంతరం ఇంటర్మీడియట్‌ను హైదరాబాద్‌లోని అల్మాస్‌గూడలో ఉన్న సంకల్ప్ జూనియర్ కళాశాలలో ఎంపీసీ పూర్తి చేసింది. ఇంటర్మీడియట్‌లో 734 మార్కులను సాధించిన దీపన్విత జేఈఈలో (హాల్‌టికెట్ నంబర్ 256125077) ఉత్తమ ర్యాంకు సాధించడంతో కుటుంబ సభ్యులతో పాటు తండావాసులతో అభినందించారు. ఉన్నత చదువులకు దాతలు సహకరించాలని తండ్రి కోరాడు.

గిరిపుత్రుడికి 590 ర్యాంకు

షాద్‌నగర్: జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో గిరి పుత్రుడు సత్తాచాటాడు. ఫరూఖ్‌నగర్ మండలం గంట్లవెల్లి పంచాయతీ దేవునిబండతండాకు చెందిన పాత్లావత్ జగన్, విజయ దంపతుల కుమారుడు సాయికిరణ్ జాతీయ స్థాయిలో 590 ర్యాంకు సాధించాడు.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే



మాది వ్యవసాయ కుటుంబం. తల్లిదండ్రులు, అధ్యాపకుల ప్రోత్సాహంతోనే మంచి ర్యాంకు సాధించగలిగా. సమయం వృథా చేయకుండా చదివా. భవిష్యత్తులో ఉన్నత స్థితికి ఎదగాలనేదే నా ఆకాంక్ష.

– సాయికిరణ్

పరిగి విద్యార్థికి రాష్ట్రస్థాయి 136వ ర్యాంకు



ప్రణవ్‌తేజ్

పరిగి: జేఈఈ అడ్వా న్స్‌డ్ ఫలితాల్లో పరిగి విద్యార్థి సత్తా చాటా డు. పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన కనకం ప్రణవ్‌తేజ్ 360 గాను 272 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయి 136వ ర్యాంకు కైవసం చేసుకున్నాడు.

మొక్కుబడిగా అవతరణ వేడుకలు

- మారని తెలంగాణ తల్లి చిత్రపటం.!
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు



యాలాల: ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి పాత చిత్రపటం



బషీరాబాద్: అలంకరణకు నోచుకోని తహసీల్దార్ కార్యాలయం

యాలాల: రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో వ్యవహరించిన తీరు విమర్శలకు తావిస్తోంది. ఉదయం 9.30గంటల సమయంలో ఎంపీడీఓ పుష్పలీల జాతీయ జెండా ఆవిష్కరణకు ఇబ్బంది పడ్డారు. ప్రతీ ప్రభుత్వ కార్యాలయం వద్ద ప్రొఫెసర్ జయశంకర్ సార్ చిత్రపటంతో తెలంగాణ తల్లి చిత్రపటాన్ని ఉంచాల్సి ఉండగా.. పాత చిత్రపటాన్నే ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ సైతం విషయం పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

అధికారుల తీరుపై కాంగ్రెస్ నేతల గుర్రు

ధారూరు: రాష్ట్ర ఆవిర్భావ ఉత్సవాలను మండల పరిధిలో సోమవారం నామమాత్రంగా నిర్వహించాలని కాంగ్రెస్ నాయకులు ధ్వజమెత్తారు. ప్రభుత్వ కార్యాలయాలను అలంకరించకుండానే వదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని చోట్ల సమయపాలన సైతం పాటించలేదని మండల పరిషత్ సముదాయంలో మినహాయిస్తే ఎక్కడా రాష్ట్ర గీతాన్ని ఆలపించలేదని మండిపడ్డారు.

అలంకరణకు నోచుకోని కార్యాలయాలు

బషీరాబాద్: రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాలను అధికారులు నామమాత్రంగా నిర్వహించారు. మండల పరిధిలోని ఏ ఒక్క కార్యాలయం విద్యుత్ అలంకరణకు నోచుకోలేదు. తహసీల్ కార్యాలయం, మండల మహిళా సమాఖ్య ఎదుట తెలంగాణ తల్లి చిత్రపటం లేకపోవడంతో పక్కనే ఉన్న మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద ఉంచిన ఫొటో తీసుకువచ్చి ఆవిష్కరణ పూర్తి చేశారు. కార్యాలయంలోనూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటంతో పాటు పాత తెలంగాణ తల్లి చిత్రపటాన్ని ఉంచారు. పలు గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో తెలంగాణ తల్లి చిత్రపటం లేకుండానే జెండావిష్కరణలు చేశారు.

విద్యుత్ సమస్యలు రానీయొద్దు

దోమ: గ్రామాల్లో విద్యుత్ సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకుడు రాంచంద్రారెడ్డి అన్నారు. సోమవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని విద్యుత్ కార్యాలయంలో ఎస్ఈకి వినతిపత్రం అందజేశారు. గుండాల గ్రామంలో కొన్ని రోజులుగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కల్గుతుందని, దాన్ని సరిచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంపై ఎస్ఈ స్పందిస్తూ.. మండల విద్యుత్ అధికారికి చరవాణి ద్వారా 24 గంటల విద్యుత్ అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారన్నారు.

వందరోజుల ప్రణాళిక విజయవంతం చేయాలి

రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

శంషాబాద్: శంషాబాద్‌ను స్వచ్ఛమైన.. పరిశుభ్రమైన పట్టణంగా మార్చుకునేందుకు ప్రభుత్వం నిర్ణయించిన వంద రోజుల ప్రణాళికను విజయవంతం చేయాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ సూచించారు. శంషాబాద్ మున్సిపల్ కమిషనర్ బి.సుమన్‌రావు అధ్యక్షతన మండలి భవనంలో ఏర్పాటు చేసిన ప్రతిజ్ఞా కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. వంద రోజుల ప్రణాళికలో పరిశుభ్రత చర్యలు, పచ్చదనం, కాలుష్య నివారణ, ప్లాస్టిక్ నిషేధం వంటి ఎన్నో మంచి కార్యక్రమాలు ఉన్నాయన్నారు. మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రజలందరు భాగస్వాములై ఈ కార్యక్రమాన్ని విజయవతం చేయాల్సిన అవసరముందన్నారు. పర్యావరణహితంగా వ్యవహరించిన వాటర్‌మెన్ నాగేష్‌ను ఎమ్మెల్యే సన్మానించారు. మున్సిపల్ మేనేజర్ శ్రావణి, మాజీ వైస్‌చైర్మన్ బండిగోపాల్ యాదవ్, నార్సింగి ఏఎంసీ మాజీ చైర్మన్ డి.వెంకటేష్‌గౌడ్, మాజీ కౌన్సిలర్లు సంజయ్‌యాదవ్, వై.కుమార్, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి సులోచన, స్థానిక నేతలు తోకల మురళి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు వరి విత్తనాల కిట్‌ల పంపిణీ

శంషాబాద్ రూరల్: 'గ్రామ గ్రామానికి వ్యవసాయ విశ్వ విద్యాలయం నాణ్యమైన విత్తన పంపిణీ' కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని రైతులకు ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ విత్తనాల కిట్‌లను అందజేశారు. మండల వ్యవసాయశాఖ కార్యాలయం వద్ద కేఎన్ఎం 1638 వరి రకం విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. రైతులు నాణ్యమైన విత్తనాల సాగుతో అధిక దిగుబడి పొందవచ్చని ఎమ్మెల్యే సూచించారు. రైతులు పండించిన తర్వాత వీటిని గ్రామాల్లోని మిగతా రైతులకు విత్తనం కోసం ఇవ్వాలన్నారు. మండలంలోని 19 గ్రామాలకు ముగ్గురు రైతుల చొప్పున వరి విత్తనాల కిట్లను పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయధికారి శ్వేత తెలిపారు. ఒక్కో రైతుకు పది కిలోల వరి విత్తనాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఇంచార్జి ఏడీ కవిత, తదితరులు పాల్గొన్నారు.